www.navatelangana.com
అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 19 జూన్ 2023

మిషన్ భగీరథ నీటినే తాగాలి

నవతెలంగాణ-బేల

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బేల గ్రామపంచాయతీలో నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిషన్ భగీరథ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో 116 గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథనీళ్లు ఇంటింటికీ అందుతున్నాయని, దీనికోసం ప్రభుత్వం రూ.320 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. తాగునీరు కలుషితం వల్లే దాదాపు అన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఇప్పుడు ఈ మిషన్ భగీరథతో సమస్య తీరిందని అన్నారు. త్వరలోనే సొంత స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం ప్రారంభం కాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, దేవన్న, జక్కుల మధుకర్, సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, తన్వీర్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతికుమార్, ఎంపీడీఓ మహేందర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద పదో తరగతి ఫలతాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయి చరణ్, సాయి కిరణ్, శివాని లను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్ని కష్టాలైనా ఎదిరించాలన్నారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరు అశోక్, పట్టణ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, గౌరవ జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు, నాయకులు శ్రీనివాస్, వనమాల ధర్మయ్య, తేలి మోహన్, జంజిరాల శ్రీనివాస్, హనుమండ్ల రవీందర్, గుజ్జ శ్రీకాంత్, సంధ్యారాణి పాల్గొన్నారు.

చినుకు జాడలేదు..చింత తీరలేదు..!

మృగశిరకార్తె(మిరుగు)దాటి పోయింది.. వర్షాకాలం ప్రారంభమైంది. కానీ చినుకు జాడలేకుండా పోయింది. ఇప్పటికే చేరాల్సిన నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మేఘాలు కమ్ముకునే ఈ తరుణంలో భానుడి సెగలు భయపెడుతున్నాయి. ఏరువాక దాటినా ఇంకా వేసవి తాపం తగ్గకపోవడంతో జనం అల్లాడిపోతున్నారు. రోజూ 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోతను భరించలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోపక్క వర్షాకాలం ప్రారంభం కావడంతో ఏదేని సమయంలో వర్షం వస్తుందనే ఆశతో కొన్ని ప్రాంతాల్లో రైతులు విత్తనాలు వేశారు. విత్తనం వేసి వారం రోజులు గడుస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఇప్పుడే విత్తనాలు వేయకూడదని.. వర్షాలు కురవగానే నేలలో తేమ ఉన్న సమయంలోనే వేసుకోవాలని సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం.. వేసవి భగభగలు తగ్గకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలో వడగాల్పులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

- మిరుగుదాటినా తగ్గని వేసవి తాపం
- రోజూ 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- వడదెబ్బతో పిట్టల్లా రాలుతున్న జనం
- ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఇప్పుడే విత్తనాలు వేయకూడదని అధికారుల సూచన



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. వర్షాలు ప్రారంభం కాగానే విత్తనాలు వేసేందుకు సంసిద్ధులయ్యారు. ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. కానీ చినుకు జాడలేకపోవడం పక్కనపెడితే కనీసం మబ్బులు కమ్ముకున్న పరిస్థితి కూడా కనిపించడం లేదు. మిరుగు దాటి పది రోజులు గడుస్తున్నా రైతుల చింత తీరడం లేదు. వేసవి తాపం ఇంకా తగ్గడం లేదు. భగభగ మండుతున్న ఎండలతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉక్కపోతతో కూడిన ఎండలు ఉండటంతో అనేక మంది అస్వస్థతకు గురవుతున్నారు. వాయవ్య భారతం నుంచి వీస్తున్న వేడిగాలుల కారణంగా ఎండల ప్రభావం ఎక్కువగా ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో రోజుకోకరి చొప్పున వడదెబ్బకు గురైన మరణించడం ఆందోళనకరంగా మారుతోంది. రెండు రోజుల క్రితం ఆసిఫాబాద్‌లో 3వ తరగతి చిన్నారి వడదెబ్బతో మృతి చెందగా..తాజాగా బోథ్ మండల కరత్వాడకు చెందిన వీఆర్ఏ కుర్మె అశోక్ వడ్డదెబ్బతో మృతి చెందడం ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉన్నాయో స్పష్టమవుతోంది.

విత్తనం వేసినా..చినుకు జాడ లేదు..!

ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఏరువాక ప్రారంభం కాగానే విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో నైరుతి రుతుపవనాలు కేరళను తాకిన వెంటనే ఇక్కడకు వస్తాయనే ఆశతో పొడి నేలలోనే విత్తనాలు వేస్తుంటారు. వర్షాలు కురవగానే మొలకెత్తి ఏపుగా పెరగడంతో పాటు త్వరగా పూత, కాత దశకు వస్తాయని అన్నదాతలు భావిస్తుంటారు. దీంతో అనేక మంది రైతులు బర్కం భూముల్లో పొడిగా ఉన్న సమయంలోనే విత్తనాలు వేయటం సాధారణ విషయంగానే మారింది. పది రోజుల క్రితం వర్షం రావడంతో ఇంద్రవెల్లి, ఇచ్చోడ మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు నల్లరేగడి భూముల్లోనూ విత్తనాలు వేసినట్లు తెలిసింది. ఎలాగైనా వర్షం వస్తుందనే భరోసాతో విత్తనాలు వేశారు. కానీ ఈ సారి వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షం వచ్చే పరిస్థితి లేదని ఎండల తీవ్రతనే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేయడం వేసవి తాపాన్ని తెలియజేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీస్తున్న వడగాల్పుల ప్రభావంతో అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. వర్షాలు ప్రారంభమయ్యే వరకు ఎండల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.



తొందరపడి విత్తనాలు వేయకూడదు



పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దు. నేలలో సరైన తేమ ఉన్నప్పుడు, పెద్ద వర్షాలు 70 నుంచి 80మి.మీ కురిసినప్పుడు నేలలో సరైన తేమ ఉంటుంది. మరోపక్క లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం పాలిసెట్ అభ్యర్థులకు నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ భరద్వాజ తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను కోఆర్డినేటర్ పరిశీలించి, సిబ్బందికి పలు సలహా సూచనలు చేశారు. అటు ధృవపత్రాల పరిశీలన అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తదుపరి ప్రక్రియ గురించి, ఇతర రూమ్‌లో క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధృవపత్రాల పరిశీలన కొరకు స్లాటు బుకింగ్ చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ధృవపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట పాలీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఎసెస్సీ మెమో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. సర్టిఫికెట్ల ధృవీకరణ తర్వాత ఆన్‌లైన్‌లో ఈనెల 21 వరకు కళాశాలల ఎంపిక ప్రక్రియ ఉంటుందని అన్నారు. ఈ నెల 25న సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ట్యూషన్ ఫీజు చెల్లింపు అనంతరం ఈ నెల 29లోగా సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. అలాగే ఇందులో మొదటి రోజు ఆదివారం 227 అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 210 అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్, సిస్టం అనాలిస్ట్ సుజయ్, అధ్యాపకులు సురేష్, నీల్‌కమల్, సుధాకర్, సంగీత, మురళీకృష్ణ, రవికుమార్, రాజేష్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

గాజులపేట్, టీచర్స్ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆదివారం సాయంత్రం మున్సిపల్ చైర్మెన్ ఆ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపడతామని అన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చైర్మెన్ వెంట ఏఈ హరిభువన్, కౌన్సిలర్స్, కాలనీవాసులు ఉన్నారు.

పొచ్చర గ్రామంలో వ్యవసాయ కార్మికుల విజయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పోచ్చర గ్రామ వ్యవసాయ కార్మికులు కూలి పోరాటంలో విజయం సాధించారు. ఆదివారం కె.ఆశన్న, డి.అశోక్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ విజయం సాధించారు. రైతులకు, వ్యవసాయ కార్మికుల మధ్య చర్చలు జరిపి, వ్యవసాయ కూలీ మహిళా కూలీలకు రూ.200 నుంచి 300కు పెంచారు. పురుషులకు రూ.400 నుంచి 500లకు పెంచారు. వ్యవసాయ కార్మికుల న్యాయమైన కోరిక మేరకు కూలీ రేట్లు పెంచిన రైతులకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలియజేశారు. కూలీ పోరాటం చేసి, కూలీ పెంచుకున్న వ్యవసాయ కార్మికులకు అభినందనలు సంఘం జిల్లా కమిటీ అభినందనలు తెలియజేసింది.

పేకాట స్థావరాలపై దాడులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా, ధరంపల్లి, గ్రామ శివారులో ఆదివారం ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరాలపై ఎస్సై గుంపుల విజయ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వరి వద్ద నుంచి రూ. 8,100 స్వాధీన పరుచుకుని, పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సర్పంచ్, ఉపసర్పంచ్ ధర్నా



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకెర, సూర్యనగర్‌లో గత నాలుగు సంవత్సరాల నుంచి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఆదివారం అధికార పార్టీ సర్పంచ్ ధారావత్ మీరాబాయి, ఉపసర్పంచ్ రాథోడ్ భిక్కులాల్ గ్రామస్తులతో అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా గత నాలుగు సంవత్సరాల నుంచి గ్రామంలో సరఫరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అలాగే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తమ గ్రామంలో మంచినీటి ఎద్దడి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే నాలుగు సంవత్సరాల నుంచి గ్రామాలలో పైపులైను పాత పైప్‌లైన్‌పై నీటి సరఫరాలు బిగించి, సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవడం జరుగుతుందని అన్నారు. అలాగే ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని మంచినీటి ఎద్దడి తీవ్రతను తీర్చాలని డిమాండ్ చేశారు. లేని లేనియెడల భారీ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో సొంత జిల్లా కోసం పోరాటం బాధాకరం

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట కార్యదర్శి వైద్య శాంతికుమారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్వరాష్ట్రం కోసం పోరాటం చేసిన రాష్ట్రంలో స్వంత జిల్లా అంటూ ఉపాధ్యాయులు పోరాటాలు చేయాల్సి రావడం బాధాకరమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతికుమారి అన్నారు. ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 317 జీఓ ద్వారా ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయి అన్యాయానికి గురవుతున్నారని, వీరు స్వంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైనా నేటికీ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల పరిస్థితి అలాగే ఉందని, ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేక, ఐదేళ్లుగా బదిలీలు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతోందని అన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా విద్యారంగ బలోపేతం కోసం పోరాటం చేసే సంఘం టీఎస్‌యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందూరావు మాట్లాడుతూ పాఠశాలల్లో గత మూడేళ్లుగా స్వచ్ఛ కార్మికులను నియమించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను. జీపీఎఫ్, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాల కోసం టీఎస్‌యూటీఎఫ్ పోరాటం చేసి సాధించుకుందని, అదేవిధంగా గురుకులాల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు కూడా 12 నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దూలం ఎల్లయ్య మాట్లాడుతూ పీఆర్‌సీ ఇచ్చే సమయం ఆసన్నమైందని, పీఆర్‌సీలో నష్టం జరిగితే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, నిరంజన్, మహిపత్‌రావు, మహిపాల్, తులసీపతి, జిల్లా కార్యవర్గసభ్యులు ఊశన్నతో పాటు అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు(టి) నియోజకవర్గంలో సాగుతున్న రేషన్ బియ్యం అక్రమాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కాగజ్‌నగర్‌లోని శ్రీ శ్రీనివాస రైస్ మిల్లులో హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం రేషన్ బియ్యం పట్టుకుందని, గతంలో కూడా హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందమే జిల్లాలో రేషన్ బియ్యం అక్రమాల గుట్టు రట్టు చేసిందని అన్నారు. స్థానికంగా ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైస్‌మిల్లర్లతో స్థానిక అధికారులు కుమ్మక్కయ్యారా అని ప్రశ్నించారు. రైస్‌మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి వాటినే తిరిగి పౌరసరఫరాల శాఖకు అప్పగించడం, వరి ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోత విధించడం వీటి ద్వారా ప్రతీ ఏడాది రైస్ మిల్లర్లు సుమారు రూ.200 కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీని వెనుక ప్రధాన హస్తం స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పదేనని ఆరోపించారు. తన అన్నదాన సత్రానికి రైస్ మిల్లర్ల నుండి ఆదాయం వస్తుండడంతోనే ఎమ్మెల్యే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. అక్రమ సంపాదనకు అన్నదాన సత్రాన్ని ఉపయోగించుకుంటున్నాడని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆ దిశగా కలెక్టర్ చొరవ చూపి జిల్లా ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. తాము కూడా దీనిపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, బీజేపీ తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, రాజేందర్‌జంజోడ్ పాల్గొన్నారు.

అపర భగీరథుడు సీఎం కేసీఆర్

- తాగునీటి అందించడంలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం తెలంగాణ అవతరణ, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని మాడెగాం గ్రామంలోని మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహించిన మంచినీటి పండుగ కార్యక్రమంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు కార్యాలయం మొత్తం కలియ తిరిగి మంచినీటి తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ రాకముందు తాగునీటి కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తాగునీటి కొరకు చెప్పులు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, గ్రామ సర్పంచ్ ఇంటి ముందర మహిళలు నీటి బిందెలతో ఆందోళన చేసిన విషయాలను ఇప్పటికీ మర్చిపోలేని అన్నారు. మహిళలు తాగునీటి కొరకు బిందెలతో రోడ్లపై బైఠాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అపర భగీరథుడు సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన మంచినీటిని గడపగడపకు అందిస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నల్గొండ జిల్లాలో ప్రధానంగా ఉన్న ఫ్లోరైడ్ సమస్య లేకుండా అధిగమించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులన్ని నిండుకుండలను తలపిస్తున్నాయని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కొరకు ఎక్కడ చూసినా ఖాళీ బిందెలు దర్శనమిచ్చేవని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు, తండాలు గూడాలలో తాగునీటి సమస్య లేకుండా మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామని గుర్తు చేశారు. స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా కింది గ్రామాలలో చెరువులు ఎప్పుడు నిండుగా కనిపిస్తున్నాయని తెలిపారు. పంటలను ముందుగా వేసుకోవాలని సూచించారు. రైతులు భూములను అమ్ముకోకుండా ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో భూములకు మంచి రేట్లు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రామ్ కిషన్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంపీపీ అక్షర అనిల్, అడిషనల్ కలెక్టర్ రాంబాబు, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, పీఏసీఎస్ చైర్మెన్ రమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కదిలి ఆలయ చైర్మెన్ భుజంగరావు పటేల్, కాల్వ ఆలయ కమిటీ చైర్మెన్ చిన్నయ్య, మాడేగా గ్రామ సర్పంచ్ సరితరాజు, ఉపసర్పంచ్ మారుతి పటేల్, ఎంపీడీఓ మోహన్, తహసీల్దార్ కలీం, ఎంపీఓ అజీజ్ ఖాన్, మిషన్ భగీరథ ఈఈ, ఏఈ, జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో జర్నలిస్టుల పాత్ర కీలకం

నవతెలంగాణ-కడెం



అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎఫ్ఆర్వో అనిత అన్నారు. ఆదివారం కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన జర్నలిస్టులను కడెం మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన కోసం అడవిలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గంగాపూర్ ఉడుంపూర్, లక్ష్మీపూర్ అడవిలో వన్యప్రాణుల సంరక్షణ కోసం చేసిన ఏర్పాట్లను గడ్డి క్షేత్రాల పట్ల ఎఫ్ఆర్వో అనిత జర్నలిస్టులకు వివరించారు. అలాగే అక్కడ నిర్మించిన వాచ్‌టవర్, తదితర వాటిని కూడా వారికి చూపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ప్రకాష్, సెక్షన్ అధికారి ఉత్తమ్, బీట్ అధికారి ఆలిమ్, పలువురు అటవీశాఖ అధికారులు, కడెం, దస్తురాబాద్ మండలాల జర్నలిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని వద్యాల ఉన్నత పాఠశాల1993-94 విద్యాసంవత్సర పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి సందడి చేశారు. పాతజ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. తమ బాల్యం నాటి ముచ్చట్లు, గత స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. ఒకరికి ఒకరు కష్ట సుఖల్లో తోడుగా ఉండాలని ఆకాంక్షించారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. రోజు అంతా ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

సోమవారం 19 జూన్ 2023

చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మిషన్ 25 డేస్‌లో భాగంగా ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ సాధనకు త్వరలో జరగబోయే చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ జిల్లాపెల్లి నవీన్ అన్నారు. ఆదివారం తాడిహత్నూర్‌లో గ్రామకమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా వాగ్మారే శుభం, ఉపాధ్యక్షునిగా ఇరాల్లే గోపాల్, కార్యదర్శిగా జాదవ్ రాజేష్, మోతే చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా బొమ్మన బాబులాల్, కలవలే రాజీవ్, కార్యవర్గ సభ్యులుగా సుమిత్, లక్ష్మణ్, ఆకాష్, మహేష్, విలాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపా కేసులన్నీ ఎత్తి వేయాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావ్



నవతెలంగాణ-ఉట్నూర్

తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో గత ఏడాదిలో నమోదైన ఉపా కేసులతో పాటు పాత కేసులన్ని ఎత్తి వేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజం రావ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో నీళ్లు, నిధులు నియామకాలు, దున్నే వారికి భూమి తదితర సమస్యలను సాదించేందుకు శాంతియుతంగా చేపట్టిన కార్యక్రమాల్లో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి, ఇలాంటి దేశద్రోహం కేసులు నమోదు చేయడం దారుణమని అన్నారు. వెంటనే ఈ కేసులన్ని ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అతిష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ, నాయకులు వెంకటేష్, శ్యాంరావ్ ఉన్నారు.

సాటి ఉద్యోగి కుటుంబానికి అండగా వీఆర్‌ఏలు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కరత్వాడా గ్రామానికి చెందిన కుర్మే అశోక్ గ్రామ సేవకునిగా విధులు నిర్వహిస్తు మూడు రోజుల కింద అనారోగ్యంతో మరణించాడు. ఆదివారం వీఆర్‌ఏల సంఘం ఆధ్వరంలో కుటుంబానికి రూ.14వేల ఆర్థిక సాయం అందించి, అండగా నిలిచారు. ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నేటి డీఎస్పీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్
- జిల్లాకు డాక్టర్ విశారదన్ మహారాజ్ రాక



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

నేడు జిల్లా కేంద్రంలో తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ అధినేత డా.విశారదన్ మహారాజ్ పాల్గొననున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య స్థాపనకు 10 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన అనంతరం డా.విశారదన్ మహారాజ్ తొలిసారిగా జిల్లాకు రానున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక కాలంలో అణగారిన కులాల విముక్తి కోసం, అణగారిన కులాల గొంతుకగా మారిన ఏకైక వ్యక్తి తమ నాయకుడు విశారదన్ మహారాజ్ అని అన్నారు. పార్టీ అధినేతతో కలిసి సాయంత్రం 4 గంటలకు మావల గ్రామం నుంచి బయలుదేరి పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా భారీ బైక్ ర్యాలీ ఉంటుందని అన్నారు. తెలంగాణ చౌక్‌లో జెండా పండుగ చేసుకుని, సాయంత్రం 6 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ గ్రౌండ్‌లో భారీ సభ ఉంటుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రచార కమిటీ సభ్యులు శ్రీనివాస్, పవన్, నవీన్, మంజుషా, శ్రీవాణి, రుచిత, ప్రశాంత్, సురేష్, వినుకుమార్, శశి కుమార్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులుగా ఇద్దరు ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ అధ్యాపక అవార్డులను సాంకేతిక విద్యామండలి ప్రకటించింది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల నుండి ప్రిన్సిపాల్ పి.భరద్వాజ, మెకానికల్ విభాగాధిపతి ఎస్ రాజ్‌కుమార్ జిల్లా స్థాయిలో ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం ఇరువురికి అభినందనలు తెలిపారు.

మండలంలో జాన్సన్ నాయక్ పర్యటన



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు భుక్య జాన్సన్ నాయక్ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి గ్రామంలో జాన్సన్ నాయక్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని 13 గ్రామ పంచాయతీలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకమై తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను వివరించారు. అలాగే ప్రతి గ్రామంలోని సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం పెరికపల్లె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గోపు సత్తన్న, రేవోజిపేట గ్రామానికి చెందిన మంతెన సత్తయ్యను ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మన గోపి, దాసరి సుధాకర్, కిషోర్, చిరంజీవి, సర్పంచ్‌లు దుర్గం శంకర్, సిడం భీంరావు, మారాజు సత్యం, కొప్పుల లచ్చన్న, రాజేశ్వర్ గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జొన్న రైతుల పేరిట... వ్యాపారుల అక్రమ దందా..!

- మహారాష్ట్ర జొన్నలు ఇంద్రవెల్లి మార్కెట్‌కు..
- ముందుగానే వ్యాపారస్తులకు గన్ని బ్యాగులు..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్యేశంతో జోన్నపంటలకు మద్దతు ధరను కల్పిస్తూ క్వింటాల్ రూ.2,970కు కొనుగోలు చేస్తోంది. ఇదంతా జరుగుతున్న వ్యాపారులు ఒక నెల ముందే రూ.1,800 నుంచి 2000 వరకు కొనుగోలు చేసి గోదాముల్లో నిలువ ఉంచారు. ఇప్పుడేమో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా అధిక ధరకు కొనుగోలు చేయడంతో వ్యాపారస్తులు పీఏసీఎస్ అధికారులతో కుమ్మక్కయ్యారు. రైతుల పేరిట బినామీ పాస్ బుక్‌లు జిరాక్స్ తీసి ఆన్‌లైన్ చేసి అమ్ముతున్నారు.



ఇదంతా అధికారులకు తెలిసిన నాయకుల అండదండలు ఉండటంతో కొనుగోలు చేయడం గమనార్హం. వ్యాపారులు ఒక చేయి ముందు కోచ్చి రూ.2వేల లోపు కొనుగోలు చేసిన జోన్నకు అధికారులతో కుమ్మక్కై క్వింటాల్ జొన్నలు సంభందిత శాఖకు రూ.100 నుంచి 200 వందల కమిషన్ పేరిట ముందుగానే చెల్లిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఒక రోజు వంద క్వింటాళ్లు అమ్మితే రూ.10 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా జోన్న కొనుగోలు కేంద్రం ఆరంభమైన రెండు రోజుల్లోనే 1150 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగిందంటే వీరి అక్రమ దందా ఏ పాటికి కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముత్నూర్‌కు చెందిన దళారులు ఈ అక్రమ దందాను అధికంగా చేస్తున్నట్లు సమాచారం. సెంటర్ నిర్వాహకులు వ్యాపారుల వాహనాలు చూడగానే ముందుగా ఖాళీ చేసి తూకం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అదే రైతుల జోన్నలకు పడిగాపులు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని గిరిజన రైతులు పేర్కొంటున్నారు.

దళారుల అక్రమ దందాను అరికట్టాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న



ప్రభుత్వ మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తున్న జొన్న పంటను దళారులే వాహనాల్లో తెచ్చి అమ్ముకుంటున్నారు. వీరికి సంభందిత అధికారులు అండదండలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం వద్ద పట్టాదారు స్వయంగా ఉంటేనే ఆన్‌లైన్ చేయాలి. దళారులు కట్టలకు కట్టలు బినామీ పట్టా పాస్ బుక్ జిరాక్స్ తెచ్చి దర్జాగా అమ్ముకోవడం అరికట్టాలి. వ్యాపారుల వాహనాలను అనుమతించకూడదు.

స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఆ పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో పాల్గొని, స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర" అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసి, బ్రిటిష్ వారిని క్షమాబిక్ష కోరిన సావర్కర్ వారసులు దేశ స్వతంత్రం కోసం ఉద్యమించిన వారికి నేడు దేశభక్తి పాఠాలను బోధించడం సిగ్గుచేటని అన్నారు. నేడు జాతీయత, దేశభక్తి పేరుతో బీజేపీ దేశ ప్రజలను మతం ఆధారంగా విభజిస్తూ, దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తు, దేశంలో ప్రజా సమస్యలను ఎత్తి చూపే వారిని నిర్బంధిస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అన్నారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై సీబీఐ దాడులకు పాల్పడుతోందని అన్నారు. భారతదేశ కీర్తిని ప్రపంచ వేదికలపై ఘనంగా చాటి చెప్పిన క్రీడాకారులు, గత 3 నెలలుగా ఆందోళన చేస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను పరిష్కరించడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ కుట్రలతో ఎంత నిర్బంధించిన ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) కార్యకర్తలు, మాత్రం అలుపెరుగని పోరాటం చేస్తూనే, ఉండాలని సూచించారు. మతోన్మాద బీజేపీ కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్, ఆత్రం కిష్టన్న, నాయకులు స్వామి, జమున, ఉయిక విష్ణు, నాగోరావ్, మోతిరామ్ పాల్గొన్నారు.



తాగునీటి కష్టాలు తీర్చిన ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్



నవతెలంగాణ-కడెం

తాగునీటి కష్టాలు తీర్చిన ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీళ్ల పండుగకు ఎమ్మెల్యే అజ్మీర రేఖ శ్యాంనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చేందుకే మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఉమ్మడి పాలనలో కిలోమీటర్ల దూరం వెళ్లి వ్యవసాయ బావులు, బోర్లు, చెలిమల నుంచి నీళ్ల తెచ్చుకునేందుకు అవస్థలు పడ్డ జనం నేడు మండు వేసవిలోనూ ఇంటి ముంగిటకే నీళ్ల వస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అలాగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేస్తున్న సర్పంచ్‌లను, ఎంపీటీసీలను, కార్యదర్శులను, మండల ప్రజా ప్రతినిధులను, ఈజీఎస్, ఐకేపీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, కడెం సర్పంచ్ అనూష లక్ష్మణ్, దస్తురాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్, దస్తురాబాద్ ఎంపీపీ కిషన్, దస్తురాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఐలయ్య కడెం, దస్తురాబాద్, ఖానాపూర్, జన్నారం మండలాలకు చెందిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్



సరుకులు, వస్తువులు సరఫరాలో కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జై ఆదివాసీ యువశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడ హన్మంత్ రావ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు గురుకుల కళాశాలలో నిత్యవసర సరుకులు, వస్తువులు సరఫరా చేసేందుకు ఇటీవల టెండర్లు నిర్వహించారని అన్నారు. ఐటీడీఏలోని ఉన్నత అధికారులు కాంట్రాక్టర్లతో మీలాకత్ అయి నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని సరుకులు, వస్తువులు సరఫరా చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటుగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పెందుర్ రాజేశ్వర్, నాయకులు రాజేందర్, ప్రకాష్, విజయ్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలని ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రోడ్డు ప్రమాదలపై రోడ్డు భద్రతలో భాగంగా మండలంలోని ఆటో డ్రైవర్లతో, ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లతో, ద్విచక్ర వాహనదారులతో సమావేశం నిర్వహించి, డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు నియమాలను పాటించినప్పుడు ఏలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆటోకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా కల్గిఉండాలని అన్నారు. ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలను పాటించి, ప్రయాణికులను వారి వారి గమ్యస్థలాలకు సురక్షితంగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి ఆటో టాప్ నెంబర్ కల్గిఉండాలని అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. మధ్యం సేవించి-వాహనాలు నడిపినట్లైతే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యాజమానులపై కఠిన చర్యలు తీసుకుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తురాబాద్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి, ఖానాపూర్ ఎస్సై శంకర్, మండల కోఆప్షన్ సభ్యుడు ముస్తాఫా, మున్యాల సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ రాజేష్, నాయకులు విలాస్ యాదవ్, రాజలింగం, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ల ఓనర్లు పాల్గొన్నారు.

ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పౌర హక్కుల నాయకులు సామాజిక ఉద్యమకారులు రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, సంధ్యలపై ప్రొఫెసర్ కాసీంలపై ఉపా యాక్ట్ కింద కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే బేషరత్తుగా వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల కోసం పనిచేసే వారిపై కేసులు నమోదు చేయడమంటే సామాన్యుడి తరఫున ఎవరు నోరు మెదపకుండా భయపెట్టే వ్యూహంలో భాగమే అన్నారు. కేవలం కొద్దిమంది కుబేరుల చేతిలో నేటిపాలక ప్రభుత్వాలు ఉపాలాంటి నల్ల చట్టలను నమ్ముకుంటాయనీ తప్ప ప్రజాస్వామిక చర్చలను నమ్మవన్నారు. అయితే ఈ సమస్యకు పరిష్కారం ఉపా లాంటి చట్టాలను రద్దు చేయడమే సరైందని అన్నారు.

బాధిత కుంటుబానికి పరామర్శ



నవతెలంగాణ-తలమడుగు

పల్లి(బి) గ్రామానికి చెందిన నల్ల సుభాష్‌రెడ్డి మాతృమూర్తి నల్ల లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేష్, స్థానిక సర్పంచ్ మల్కు, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అబ్దుల్లా, మగ్గిడి ప్రకాష్, నిట్యాడి గంగాధర్, నర్సా రెడ్డి, దూస సంతోష్, అశోక్, గంగాధర్, ప్రవీణ్, రమేష్, స్వామి గజనన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న పాఠశాలల్లో విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఆదిలాబాద్ డీఈఓ ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ, పాఠశాల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ గార్డెన్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలతో సత్కరించడం జరుగుతుందని అన్నారు.

నేడు కేజీబీవీలో హరితోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఉదయం 10 గంటలకు హరితోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉపఅటవీ క్షేత్రాధికారి నజీర్, కేజీబీవీ ప్రత్యేక అధికారి నవిత ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అనుకుంట గ్రామానికి చెందిన ముక్కెర శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ సాయి తేజ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రత్నాకర్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, దినేష్ మాటోలియా, సుభాష్ ముకుంద్ పాల్గొన్నారు.

యాసిడ్ దాడిలో నిందితురాలు అరెస్ట్

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని తరోడ గ్రామంలో గత ఐదు రోజుల కింద మోహన్ అనే వ్యక్తిపై యాసిడ్ దాడి చేసిన ఘటనలో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాయి కిరణ్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానితు లను విచారించగా తమ కుటుంబ గొడవలకు కారణమవుతున్న బావ మోహన్‌పై మరదలు కల్పన దాడి చేసినట్లు తమ విచారణలో తేలిందని ఎస్సై పేర్కొన్నారు. నిందితురాలును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 19 జూన్ 2023

పంచాయతీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కామాన్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంచిర్యాల డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి జరిగిన అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో సర్పంచ్, కార్యదర్శులదే పాత్ర కీలకమన్నారు. స్మశాన వాటిక, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ పేరం మానస శ్రీనివాస్ కార్యదర్శి కరుణాలను అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వారికి సూచించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని దేతిగూడ గిరిజన గ్రామానికి చెందిన మరుసుకోల కృష్ణ(29) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు దండేపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు కృష్ణ ఈనెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఏదైనా పనిమీద వెళ్లి ఉంటాడని ఇంట్లో వాళ్ళు అనుకున్నారు. కాగా శనివారం కుంటలు గూడా కట్ట గిరిజన గూడెం సమీపంలోని పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందగా చుట్టుపక్క గ్రామాల్లో తెలియజేశారు. మృతుని మీద ఉన్న దుస్తులతో కుటుంబ సభ్యులు జైతుగూడకు చెందిన కృష్ణగా గుర్తించారు. మృతుని అన్న మరుసుకోల సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

లైబ్రరీలో పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కాంప్లెక్స్ వారీగా సరఫరా చేయుటకు జిల్లాలోని యుఆర్‌ఎస్ కేంద్రంగా పంపిణీకి సిద్ధంగా ఉన్న రూమ్ టూ రీడ్ స్వచ్చంద సంస్థ వారి పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. రూమ్ టూ రీడ్ స్వచ్చంద సంస్థ వారు అందజేస్తున్న పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంప్లెక్స్ వారీగా తీసుకొని వాటిని గ్రంథాలయాల్లో పిల్లలకు అందుబాటులో ఉంచాలని తద్వారా విద్యార్థుల్లో రీడింగ్ అలవాటును పెంపొందించాలని సూచించారు. గ్రంథాలయానికి ఒక టీచర్ బాధ్యత వహిస్తూ ప్రతిరోజు పిల్లలచే వాటిలోని కథలను కథాంశాలను అర్థం చేసుకొనే స్థాయిని పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-జన్నారం

ఆలయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతగూడ గ్రామంలో పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి ఆలయ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. లక్ష్మీదేవి ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా బీర్పురి మల్లేష్, సభ్యులుగా శ్రీపతి రవీందర్, భూక్యా తిరుపతి, కూనారపు రాజన్న , ముత్యానగిరి శంకరవ్వ, నీరటి గట్టయ్య, బొలిశెట్టి విజయ్ కుమార్ ఏడుగురు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ ఆలయ ఈఓ శరత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్ధన్, యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి భరత్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న, నందు నాయక్, బీవీఎస్ నాయక్, మల్క లక్ష్మణ్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దండేపల్లి



తెలంగాణ అఖిల భారత విశ్వకర్మ మహాసభ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశానికి సంఘం రాష్ట్ర నాయకులు కట్ట వెంకటేష్, శ్రీ కోటి జలంధర్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్‌లు హాజరయ్యారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నూతల శ్రీకాంత్, అధ్యక్షులుగా వేమునూరి సత్యనారాయణ, ఇనుగుర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భీమోజు కర్ణచారి, కోశాధికారిగా కట్ట శ్రీధర్‌చారి, ప్రచార కార్యదర్శిగా వేమునూరు వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా దేవయ్య రంగు రాజేశం, తిరుపతి, సత్తన్న, లక్ష్మీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ట వెంకటేష్ చారి తెలిపారు. ఎన్నికైన సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తూ సంఘ నిర్మాణంలో భాగస్వాములు అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వకర్మ సంఘ నాయకులు, విశ్వకర్మ కులాస్తులు పాల్గొన్నారు.

21న బహిరంగ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలందరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షెట్టిపేట్ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతారని పేర్కొన్నారు. నీళ్ళ, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో ఎలాంటి పురోగతి సాధించలేదని విమర్శించారు. నూతన సమీకృత కలెక్టర్ భవనాన్ని ప్రారంభించడానికి వచ్చిన కేసీఆర్ కార్మికుల కోసం ఏం చేశాడని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి, కుంభకోణాలకు అడ్డగా మారిందని, రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 23వ వార్డు కౌన్సిలర్ అగల్ డ్యూటీ రాజు, బీజేపీ నస్పూర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున్, దళిత మోర్చా పార్లమెంట్ ఇన్‌ఛార్జి పానుగంటి మధు, నస్పూర్ బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిలు సత్రం రమేష్, ఈర్ల సదానందం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకట కృష్ణ, జిల్లా బీజేపీ దళితమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి మొగిలి పాల్గొన్నారు.


అర్ధరాత్రి బోరుబావుల తవ్వకాలు

- నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని స్థానిక సీవీరామన్ పాఠశాల ఆవరణలో అనుమతులు లేకుండా శనివారం అర్ధరాత్రి బోరుబావి వేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమంగా బోర్లు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటే ఏరియాలో బోర్లు వేయవద్దని తాగునీటి కోసం తప్పితే ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర అవసరాలకు బోర్లు వేస్తే 'వాల్టా' చట్టం కింద చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్టు



వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. చట్ట విరుద్ధంగా బోర్వెల్ యాజమానులు విచ్చలవిడిగా పట్టణంలో బోర్లు వేస్తున్నారు. తాగునీటి అవసరాలకు తప్ప ఇతర అవసరాలకు బోర్లు వేయవద్దని తెలిసి స్థానికంగా బోర్లు వేస్తున్న వారి వాహనాల యజమానులు, స్థల, ఇంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా అక్రమ బోర్లు వేసే వారిపై చర్యలు తీసుకొని యెడల రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఎవరికి చెప్తారో చెప్పుకో...

బోరు వేస్తున్న ప్రదేశానికి వెళ్లి బోర్ పర్మిషన్ ఉందా అని అడిగిన నవతెలంగాణ రిపోర్టర్ సదరు యజమాని ఎలాంటి అనుమతులు లేవు ఎవరి చెబుతారు చెప్పుకోండి అని, వాహనాన్ని పోలీస్‌స్టేషన్ పెండతా పెట్టండి అని సమాధానం ఇచ్చారు. ఈ విషయాన్ని బోర్ వేస్తున్న భూమి యాజమాని దృష్టికి బోర్వెల్ యాజమాని ఫోన్ చేసి చెప్పడంతో ఆ యాజమాని ఏం కావాలి మీకు అని అడుగుతూనే ఏం చేస్తారో చేసుకోండి అని దురుసుగా మాట్లాడారు. గతంలో సింగరేణి కార్మికుల పిల్లల కోసం స్థానికంగా పాఠశాల నిర్వహించుకోవడానికి సింగరేణి వద్దనుండి పెద్ద ఎత్తున భూమిని పొంది కొన్ని సంవత్సరాలు నడిపిన తర్వాత దానిని మూసివేసి అందులో నివాసం ఏర్పరచుకొని, మిగిలిన స్థలాన్నీ, గదులను కమర్షియల్‌కు అద్దెకు ఇస్తూ అవసరంవస్తే అమ్ముకుని లక్షలు సంపాదిస్తున్నారు. వాటి అవసరాల కోసమే ఈ బోర్వెల్ వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అటు సింగరేణి ఇటు మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏదేమైన అధికారుల నిర్లక్ష్యవైకరికి అక్రమార్కుల ఆగడాలు పెరిగిపోతున్నాయి.

శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మిడివెళ్ళి శంకర్, అధ్యక్షుడిగా గుల్ల బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా గోదారి భాగ్యరాజు, ట్రెజరర్‌గా కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంగళ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే వేరే గనులలో ఫిట్ సెక్రటరీలను, సహాయ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సొంతింటికల నెరవేర్చుకోవటానికి,పెర్క్స్‌పై ఐటీనీ తిరిగి పొందటానికి కార్మికులలో అవగాహన కల్పిస్తూ, యూనియన్ చేసే వివిధ ఆందోళన పోరాటాల కార్యక్రమాల ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడానికి కార్మికులను భాగస్వామ్యం చేసి దిశగా ప్రయత్నిస్తామని వివిధ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

పేద కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని లింగయ్యపల్లె గ్రామానికి చెందిన కొమురయ్య యాదవ్ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గొర్రెల కాపరుల సంఘం జిల్లా డైరెక్టర్ గట్టు మహేష్ యాదవ్ వారి కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఉదయం కొమరయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

శుద్ధజలంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా

- జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి
- ఘనంగా మంచినీళ్ల పండుగ వేడుకలు



ఆసిఫాబాద్‌లో...

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ ద్వారా వస్తున్న శుద్ధ జలంతో జిల్లాలోని ప్రజల ఆరోగ్యాలకు భరోసా కల్పించామని జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాణిక్ గూడ వద్ద ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్ ఆవరణలో ఈఈ వెంకటపతి అధ్యక్షతన నిర్వహించిన మంచినీళ్ల పండగ వేడుకల్లో ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదరపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రావడానికి పూర్వం జిల్లాలోని అనేక ఆదివాసి గ్రామాలు తాగునీటికి ఇబ్బంది పడే వారన్నారు. తాను ఆసిఫాబాద్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో పోరాట గడ్డ జోడేఘాట్ గ్రామస్తులు నీరు లేక కింద మోవాడ్ గ్రామానికి వలస వెళ్లారని చారిత్రక నేపథ్యం కలిగిన గ్రామం ఖాళీ కాకూడదని తాను కల్పించుకొని అక్కడ బోర్వెల్ వేయించానని గుర్తు చేశారు. అక్కడ ప్రజలు చిన్నపిల్లలకు స్నానం చేయించిన నీళ్ళు వృధా కాకూడదని పశువులకు పెట్టే వారన్నారు. అంత దుర్భరమైన పరిస్థితి నుండి నేడు పుష్కలంగా నీరు ఉండే ప్రాంతంగా రూపుదిద్దుతుందని ఇదంతా మిషన్ భగీరథ వల్లనే సాధ్యమైందన్నారు. ఎత్తున ఉన్న ప్రాంతాలకు కూడా నీరు అందిస్తున్నట్లు వివరించారు. కొన్నిచోట్ల ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమే అయినప్పటికీ ఎప్పటికప్పుడు వాటిని అధిగమించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ఎంత గొప్ప పథకమని తెలిపారు. గత 16 రోజుల దశాబ్ది ఉత్సవాల్లో ప్రతిరోజు వివిధ రకాల విభాగాలు పనిచేస్తున్న తీరును ప్రభుత్వ అభివృద్ధిని కార్యక్రమాల రూపంలో వివరిస్తున్నట్లు తెలిపారు. రూ.224 కోట్ల వ్యయంతో 1104 హాబిటేషన్లకు నీరందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ తోనే ఇదంతా సాధ్యమవుతుందని తెలిపారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, రైతుబంధు సమితి జిల్లా చైర్మన్ జగ్గాగౌడ్, వివిధ మండలాల జడ్పీటీసీలు అరిగెల నాగేశ్వరరావు, అజయ్, వివిధ మండలాల ఎంపీపీలు మల్లికార్జున్, మోతీరాం, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సింగల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

హాజీపూర్ : మిషన్ భగీరథతో మహిళల కష్టాలు తీరాయని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా ఆదివారం మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ త్రాగునీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద నిర్వహించిన జిల్లా వ్యాప్త మంచినీళ్ళ పండుగ వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు తాగునీటి కష్టాలు వుండేవని సాధించుకున్న తెలంగాణాలో ఇంటింటికీ తాగునీరు వస్తుందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి వంద లీటర్ల నీరు ఉచితంగా సరఫరా అవుతోందని అన్నారు. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా తాగు నీరు సరఫరా అవుతుందన్నారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లను సన్మానించారు. సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆట పాటలు అలరించాయి. జిల్లా వ్యాప్తంగా 500 మంది వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, జడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, గుడిపేట్ సర్పంచ్ లగిషెట్టి లక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ అంజన్ రావు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని అన్ని గ్రామాలలో మిషన్ భగీరథ మంచినీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని పోన్కల్, తిమ్మాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ మంచినీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, మిషన్ భగీరథ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మంచినీటి ప్రతిజ్ఞ చేయించి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, వెంకటయ్య, లక్ష్మి రాజన్న, పొంకల్ ఉప సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు గంగన్న యాదవ్, కడార్ల నరసయ్య, లతాశ్రీ పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో దశాబ్ది ఉత్సవాలు భాగంగా ఈరోజు మంచి నీళ్ల పండుగను నిర్వహించడం జరిగింది. గ్రామపంచాయతీ నుండి వాటర్ ట్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత వాటర్ ట్యాంక్ వద్ద ప్రతిజ్ఞా చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి అనంతరం మిషన్ భగీరథలో నాడు నేడు సాధించిన ప్రగతిని వివరించారు. ఉత్తమ సేవలదించిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శేఖ్ సఫ్దర్ అలీ పాల్గొన్నారు.

పెంచికలపేట్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ మంచినీల్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద ర్యాలీ నిర్వహించి భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. మురళీగూడ గ్రామంలో మిషన్ భగీరథ మంచినీల్ల పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో పంచినీళ్ల పండుగ ఉత్సవాలు ఘనంగా చేపట్టారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ వచ్చాక నీటి సౌకర్యాలు మెరుగు, మిషన్ భగీరథ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామ సభలో ఏఈ వినయ్ మిషన్ భగీరథ ఆవిష్యకతను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఏఈ వినయ్, కార్యదర్శి మేఘన, కోఆప్షన్ సిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

దండేపల్లి : మండలంలోని తాళ్ల పేట గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత పరిస్థితిని ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలకు మంచినీరు ఏ విధంగా వస్తుంది వాటిని ఏ విధంగా కాపాడుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, మాజీ వైసిపి ఆకుల రాజేందర్, మిషన్ భగీరథ ఏఈ శిరీష, స్థానిక నాయకులు దయాకర్, రవి, లచ్చన్న శ్రీకాంత్ పాల్గొన్నారు.

జైపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి పంపిణీ చేస్తున్న మిషన్ భగీరథ మంచినీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధి వివిధ గ్రామాలలో మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో మిషన్ భగీరథ ద్వార ఇంటింటికి స్వచ్ఛమైన నీటిని ప్రభుత్వం పంపిణీ చేస్తోందని వివరించారు. రామారావుపేట్ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, షెట్‌పల్లి సర్పంచ్ మేడి రవి గ్రామస్థులతో కలిసి వీధుల్లో ప్రచారం చేశారు. షెట్‌పల్లి గ్రామ పంచాయతి పరిధిలో ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ ఇవ్వడంతో పాటు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని స్థానిక సర్పంచ్ మేడి రవి తెలిపారు.

బెజ్జూర్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెజ్జూర్‌లో మంచినీళ్ల పండుగ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అభిలాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పంద్రం పుష్పలత హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, జావిద్, బెజ్జూర్ సర్పంచ్ కొత్రంగి శారద, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం పాల్గొన్నారు.



హాజీపూర్‌లో...



జన్నారంలో...



పెంచికల్‌పేట్‌లో...



దండేపల్లిలో...

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని లంబడిగూడ గ్రామానికి చెందిన ముడిమడుగుల అనిల్‌కు గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులకు తాళలేక సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో రూ.19 వేలు మంజూరు అయ్యాయి. ఆ చెక్కును ఆదివారం మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్ అనీల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో మంజూరు అయిందని తెలిపారు. కార్యక్రమంలో మర్తిడి ఎంపీటీసీ గురుజల వెంకన్న,బీఆర్ఎస్ నాయకులు బొర్కుట్ తులసీరామ్, గొమాస నారాయణ, ఆజీమ్ ఖాన్, ముడిమడుగుల నారాయణ, దూపం శ్రీను పాల్గొన్నారు.

50ఏండ్ల వయసులో పది పాసైన మహిళ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



చదువుపై మక్కువ తనను 50ఏండ్ల వయసులో పరీక్ష రాసేలా చేయడమే కాకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పదో తరగతిలో సత్తా చాటింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామానికి చెందిన శ్రీరామోజీ వార్ రేఖా ప్రభాకర్ తన 50వ యేటా ఓపెన్ పదో తరగతి పరీక్షలు రాసింది. అయితే ఇటీవల విడుదలైన ఫలితాల్లో 3.2జీపీఏతో ఉత్తీర్ణత సాధించి ఔరా అనిపించారు. చదువుకు వయసుతో సంబంధం లేదని నిరూపించారు. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

భగీరథ నీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్

నవతెలంగాణ-జైనథ్

భగీరథ నీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని అన్నారు. అందులోనే భాగంగానే ఆదివారం ఉదయం మండలంలోని మిషన్ భగీరథ ట్యాంకులను అలంకరించి సంబరంగా వేడుకలను మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో నీటి కొరత ఏర్పడి ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నీటి కొరత లేకుండా, మిషన్ భగీరథ పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, ఎంపీటీసీ కోడిచెర్ల సుదర్శన్, దేవాదాయ కమిటీ మాజీ చైర్మెన్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ గజానన్, కార్యదర్శి ముజీబ్, నాయకులు లస్మన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలో మంచి నీళ్ల పండుగ నిర్వహించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత, ఉపయోగాలు గురించి, ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, మిషన్ భగీరథ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తలమడుగు : దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పల్సి(బి) గ్రామంలో మంచినీళ్ల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, ఎంపీడీఓ రమాకాంత్, గతంలో గుట్ట మీద గ్రామాల ప్రజలు నీటి సమస్యతో బాధపడేవారని అన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రజలకు నిత్యం నీరు రావడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పూసం సరోజ బాపురావు, పల్సి(బి) తండ సర్పంచ్ అంగూర్, ఏఈ గ్రిడ్ మహేష్, సుంకిడి ఎంపీటీసీ వెంకన్న, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ రఫిక్, గ్రామస్తులు సూర్యబాన్, ఆనందరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాంసి : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీటి పండుగ పురస్కరించుకొని తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి ట్యాంకులను శుభ్రం చేసి ట్యాంకుల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీటి అవశ్యకతపై గతంలో ఉన్న నీటి సమస్య ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ నీటి సౌలభ్యం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లింబాజి వెంకన్న, స్వప్న, గజనన్, సదానందం, వార్డు సభ్యులు కాంతరెడ్డి, కళ్యాణ్, ప్రసాద్, కవిత అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్నూర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాన్యాపూర్, గంగాపూర్, తాడిహత్నూర్, మలెంగి, కొత్తపెల్లితో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో మంచినీళ్ల పండుగను సర్పంచ్‌లు కార్యదర్శులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ తీస్తూ, భగీరథనీటి ట్యాంకు వద్ద పూజలు చేశారు. అనంతరం భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రశంస పత్రాలను అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ సావిందర్, గ్రామపటేల్ మెస్రం రూపదేవ్, ఉపసర్పంచ్ రాయిసిడం రూప్‌దేవ్ ఏఈ సుభానీ, సర్పంచ్‌లు యుర్వేత రూపదేవ్, పూసం రూపగోపాల్, మధుకర్ రాథోడ్, రాథోడ్ సుభద్రరామేశ్వర్, కార్యదర్శులు లవకుమార్, ముండే రమేష్, స్నేహ, శేఖర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని కచ్‌కంటి గ్రామంలో ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండుగను ఆయాగ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కుర్ర లక్ష్మి శ్రీనివాస్‌కు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు ప్రతి గ్రామంలో గిరిజన తండాల్లో మిషన్ భగీరథ తాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో పుష్కలంగా నీరు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. గ్రామాల్లో నీటి కొరత లేకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.










జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కాగజ్‌నగర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్


వచన్ బియాని


వేదాంత్ అసావా

జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్‌లో కాగజ్‌నగర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి మెరుగైన ర్యాంక్ సాధించారు. ఈ ఇద్దరు విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటీలో సీటుకు అర్హత సాధించారు. జూన్ నాలుగున ఈ పరీక్ష నిర్వహించగా, ఆదివారం ఫలితాలు వెల్లడయ్యాయి. స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన ప్రముఖ వ్యాపారి రాహుల్ బియాని-నీలం బియానిల చిన్న కుమారుడు వచన్ బియాని (నెం.236049919) కామన్ ర్యాంక్ 2,383 సాధించి ఐఐటీలో సీటు సాధించేందుకు అర్హత సాధించాడు. వచన్ బియాని జేఈఈ మెయిన్స్‌లో 99.63 శాతం మార్కులు సాధించి అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యాడు. అదేవిధంగా స్థానిక వ్యాపారి ప్రేం అసావా-ప్రమీలా అసావాల కుమారుడు వేదాంత్ అసావా (నెం.236159223) ఆలిండియా జనరల్ కేటగిరీలో 3,579 ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటుకు అర్హత సాధించాడు. ఇతను జేఈఈ మెయిన్స్‌లో 99.1 శాతం మార్కులతో అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యాడు.

సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదాం



నవతెలంగాణ-రెబ్బెన

11వ వేతన ఒప్పందంలో సింగరేణి కార్మికులకు జాతీయ సంఘాలు అన్యాయం చేశాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. ఆదివారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ కార్యవర్గ సమావేశంలో సభ్యులు అందరూ జాతీయ సంఘాల వైఖరిని తప్పుపట్టారు. యాజమాన్యం మీద ఎలాంటి ఒత్తిడి తేకుండా తక్కువ వేతన పెరుగుదలకు ఒప్పందం చేసుకోవడం కార్మికులకు తీవ్ర నష్టం చేసినట్టు అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ కేంగర్ల మల్లయ్య పాల్గొని ప్రసంగించారు. సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని దానికి నిరసనగా యాజమాన్య వైఖరిని ఎండగట్టాలని తీర్మానించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సింగరేణిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నదని అన్నారు. బెల్లంపల్లి ఏరియా నుండి టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంఘం ప్రకాష్ రావు లెవెల్ మెన్ కమిటీ మెంబర్ మంగిలాల్ సెంట్రల్ కమిటీ సభ్యులు గెల్లి రాయలింగు బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీమల్‌రాజ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి హరితోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే తెలంగాణ హరితోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్ కోరారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఆయా గ్రామాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు.

హరితోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న హరితోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల ఆవరణలో 100 మొక్కలకు తక్కువ కాకుండా నాటాలని, గ్రామ పంచాయతీల పరిధిలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటే ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నాటిన మొక్కలు ఎప్పటికప్పుడు సంరక్షించాలని సూచించారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 8:30 నుండి 12:30 వరకు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు చివరగా జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.



హరితోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంది శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు : బీజేపీ

- కంది వ్యాఖ్యలను ఖండించిన నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన కొత్త రాజకీయ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి, ప్యారాశూట్ లీడర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్రాల నగేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీజేపీ పార్టీపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్‌పై కంది చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, మతకలహాలు సృష్టించే పార్టీ అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికా నుండి ఉడిపడి బీజేపీలో చేరినప్పుడు గుర్తుకు రాలేదా ఇది మతతత్వ పార్టీ అని ఎద్దేవా చేశారు. జిల్లా ప్రజల మొబైల్ ఫోన్‌లో ఆయన గతంలో మాట్లాడిన మాటలు అప్పుడప్పుడు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ప్రజలు వింటూ ఉంటారన్నారు. పుట్టుకతో వచ్చిన గుణం పుడుకలతోనే పోతుందని, నేను చస్తే నాశవం పై కాషాయ జెండాను పెట్టండి అన్న మాటలు మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. క్రమశిక్షణ నిబద్ధత గల భారతీయ జనతా పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. కంది శ్రీనివాసరెడ్డి పై క్రిమినల్, సివిల్ కేసు, పరువు నష్టం దావా వేస్తున్నామని తెలిపారు. బీజేపీలో తనకు జాతీయ నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ ఎమ్మెల్యే టిక్కెట్టు తనకే అని తన భజన ఛానల్ లో ప్రచారం చేసుకొని భంగపడ్డారని అన్నారు. జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, జోగురమన్న చీకటి మిత్రులు అనడం రాజకీయాలపై అవగాహన లేని రాహిత్యమని అన్నారు. రెండు దఫాలు పోటీ చేసి స్వల్ప తేడాతో ఒడిపోయారని గుర్తుచేశారు. మున్ముందు బీజేపీపై అనుచిత వ్యాఖ్యలు చేసే ముందు ఒక్కసారి ఆలోచించుకోవాలని లేదంటే తదుపరి పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అస్తక్ సుభాష్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, దయాకర్, రాందాస్, సంతోష్, శ్రీనివాస్, శివ, జైపాల్ ఉన్నారు.

ఖానాపూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగుర వేద్దాం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాబోయే ఎన్నికల్లో ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడం ఖాయమని ఏఐసీసీ రీసెర్చ్ డైరెక్టర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని మర్కగూడ ఆదివాసీ గ్రామంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో చేపట్టిన యూత్ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్లరేషన్‌కు ఆకర్షితులై సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీ ఖండువాను కప్పుకున్నారు. చేరిన వారిలో దిలీప్ గాయక్వాడ్, విజయ్, ఆత్రం రూప, మాధవి, లత, సంగీత, శైలజతో పాటు వంద మంది యువతి, యువకులు భారీగా పార్టీలో చేశారు. రాబోయే ఎన్నికలలో ఇక కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతును ప్రకటిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజనులకు ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో మోసగించాడని ఆరోపించారు. గిరిజన ప్రతి కుటుంబానికి మిషన్ భగీరథ కింద నల్ల నీళ్ల అందించిన తరువాతనే ఓట్లు అడుగుతానని ఓట్లు దండు కున్నాడని అన్నారు. అధికారంలో వచ్చిన తరువాత ఖానాపూర్ పాలకులు కేవలం పరామర్శ లే తప్ప గిరిజనులు నివసిస్తున్న మామిడిగూడ వంటి గ్రామాలకు గుక్కెడు తాగు నీళ్ల అందించలేదని ఆరోపించారు. గిరిజనులకు గిరిజన బంధు, రైతు రుణ మాఫీ, నిరుద్యోగ భృతి వంటి చేసిన ఏ ఒక్క వాగ్దానం సైతం అమలు చేయలేదని ప్రశ్నించారు. దానిలో భాగంగానే గిరిజన యువత కాంగ్రెస్ పార్టీ రావాలని భారీగా చేరికలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సోమురే నాగోరావ్, జిల్లా ప్రచార కార్యదర్శి మీర్జా యాకూబ్ బేగ్ పాల్గొన్నారు.

మంచినీటి పండుగను అడ్డుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-తాంసి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పొన్నారి గ్రామంలో మంచినీళ్ల పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా కొందరు గ్రామస్తులు వచ్చి గ్రామంలో మిషన్ భగీరథ చుక్కా నీరు సరఫరా కావడం లేదని, గ్రామంలో తాగునీటి సమస్య ఉండగా మంచినీళ్ల పండుగ ఎలా నిర్వహిస్తారని, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తులకు మంచినీళ్ల పండుగను బహిష్కరించి, నిరసన తెలిపారు. ఎంపీటీసీ, సర్పంచ్, గ్రామస్తులను సముదాయించి, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరా అయ్యేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేఖారఘు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్-సిర్పూరు(టి) రైల్వేస్టేషన్‌ల మధ్యలో వేంపల్లి రైల్వే క్యాబిన్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. సుమారు 40 ఏళ్ల కలిగిన మృతుడు గ్రీన్ బ్లాక్ లైనింగ్స్ లుంగీ ధరించి ఉన్నాడని, మరే ఇతర ఆధారాలు లేవని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9490871784, 9948481902 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

సిక్కా బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ క్లర్క్ అసోసియేషన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిక్కా అధ్యక్షుడు బొల్లం మధుమోహన్ అన్నారు. ఆదివారం సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిక్కా హక్కుల కోసం అందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. కోల్ ఇండియా ప్రతిపాదికన ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రమోషన్ ఇవ్వాలని, మినిస్ట్రియల్ స్టాఫ్ విధులలో విధిగా మినిస్ట్రీయల్ స్టాఫ్‌ని నియమించాలని తెలిపారు. కంప్యూటర్ అలవెన్స్ ఇవ్వాలని, గతంలో మాదిరిగా ఇన్‌సెంటీవ్ అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా రెస్ట్ హాల్స్, వాష్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే క్లర్క్ పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సారంగపాణి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునికి సన్మానం



నవతెలంగాణ-జన్నారం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు అజ్మీర హరి నాయక్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఆపార్టీ మండల అధ్యక్షులు గోలిచంద్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెల్పాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దస్తురాబాద్ మండల అధ్యక్షుడు కొడిమెల లక్ష్మణ్, కడెం మండల అధ్యక్షుడు ధర్మాజీ కిష్టయ్య, ఖానాపూర్ మండల అధ్యక్షుడు టేకు ప్రకాష్, పెంబి మండల అధ్యక్షుడు తులాల సదాశివ్ పాల్గొనరు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రధాని నరేంద్రమోడీ 102వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు వీక్షించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు టాకూర్ విజయ్‌సింగ్, మందాడె సుధాకర్, జిలకర పోచం, మొండయ్య, నానాజీ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

నవతెలంగాణ-ముథోల్

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముథోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మోహన్‌రావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముథోల్‌లో గడపగడప బీజేపీ అనే కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వలన ప్రజలు విసిగించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కానీ దళితబస్తీ, దళితబంధు సంపూర్ణంగా అమలు చేసిన దాఖలు లేవని ఆరోపించారు. రానున్న రోజులలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, నాయకులు జీవన్, ప్రవీణ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి డిగ్రీ పరీక్షలు వాయిదా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నిర్వహించే డిగ్రీ రెండు, ఆరో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తూ విశ్వవిద్యాలయం పరీక్షల కంట్రోలర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మినరసింహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 20న తెలంగాణ విద్యా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న కారణంగా ఈ పరీక్షలను వాయిదా వేశారని, తిరిగి ఈ పరీక్షలను జులై 6, 15వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని, మిగిలిన పరీక్షలు యదావిధిగా కొనసాగుతాయని తెలిపారు.